నిలిచిపోయిన ట్రంకులైన్ పనులు ప్రారంభించండి

● ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ నర్సింహారెడ్డి



ట్రంకులైను పనులు ప్రారంభించాలని ప్రజావాణిలో హెచ్‌ఎండబ్ల్యూఎస్ జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

హయత్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలో నిలిచిపోయిన ట్రంకు లైను, తాగునీరు, భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభించాలని కోరుతూ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సోమవారం హెచ్‌ఎండబ్ల్యూఎస్, సీవరేజీ బోర్డు జీఎం శ్రీనివాస్‌రెడ్డికి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బిల్లులు చెల్లించినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పనులు చేయడం లేదని కార్పొరేటర్ తెలిపారు. రెండు సంవత్సరాలుగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. అసంపూర్తి పనులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇచ్చిన లేఖను ప్రజావాణిలో కలెక్టర్‌కు అందిస్తున్న సరోజ, బీజేపీ నాయకులు

బస్తీ దవాఖానాలోనే కొనసాగించండి

● ప్రజావాణిలో విజ్ఞప్తి చేసిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సరోజ

హయత్‌నగర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడలోని బస్తీ దవాఖానాలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా కొనసాగుతున్న రమావత్ సరోజాను అక్కడే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సోమవారం బీజేపీ మున్సిపాలిటీ నాయకులు, మాజీ కౌన్సిలర్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత కాలంగా రమావత్ సరోజా బస్తీ దవాఖానాలో హెల్పర్‌గా పని చేస్తుంది. ఇటీవల స్థానిక బస్తీ దవాఖాన డాక్టర్లు ఆమెను డ్యూటీకి రావద్దని తాము ఇతరులను నియమించుకుంటామని చెప్పారు. దీంతో ఆమె బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కందాళ భలేదేవ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కళ్యాణ్‌నాయక్, భిక్షపతితో కలిసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. దీంతో కేంద్రమంత్రి సరోజను స్థానికంగా లేదా మరో చోట కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. సోమవారం సదరు లేఖతో బీజేపీ నాయకులు, మాజీ కౌన్సిలర్‌తో కలిసి వెళ్లి ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు లేఖను అందజేశారు. తనకు కమ్మగూడలోనే కొనసాగించాలని ఆమె కోరారు. దీంతో కలెక్టర్ జిల్లా వైద్యాధికారికి పలు ఆదేశాలు జారీ చేశారు.



ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి

గాంధీనగర్ స్కూల్‌కు భవనం కేటాయించండి

సైదాబాద్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్ గాంధీనగర్ బస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు బీ బ్లాక్‌లోని 56, 57 క్వార్టర్స్ కేటాయించాలని కోరుతూ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం పాఠశాలలో ఇరుకు గదులలో రెండు, మూడు తరగతులు నిర్వహిస్తున్నారని, దీంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమీపంలోని బీ బ్లాక్ ప్రభుత్వ క్వార్టర్స్ నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజారాం, దిలీప్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు ముందస్తుగా నిధులు మంజూరు చేయండి



డ్రైనేజీ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సహదేవ్‌యాదవ్

సైదాబాద్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బోనాలకు ముందస్తుగా నిధులు మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం కుర్మగూడలో డ్రైనేజీ మరమ్మతు పనులను పరిశీలించారు. జూలై 20న పాతబస్తీలో జరిగే బోనాలకు నిధులు వెంటనే మంజూరైతే అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మోహనకృష్ణ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జునస్వామి కల్యాణ వేడుకల్లో నాయకులు

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనాజ్‌పూర్ గ్రామంలో స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ మునిరాజు, మల్లికార్జున భ్రమరాంభ కేతమ్మ కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేష్, రాష్ట్ర నాయకుడు దండెం రాంరెడ్డి, బాటసింగారం రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు చేగూరి భరత్‌కుమార్ కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి తీర్థప్రసాదములు అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.



కాలనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

రోడ్డుపై నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కొత్తపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కమర్షియల్ ట్యాక్స్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన కాలనీ ప్రతినిధులతో కలిసి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో రూ.39లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. గుంతలు ఉన్న అంతర్గత మట్టి దారుల్లో సీసీరోడ్డు వేయిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిలువకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్ అదనపు గదులు/హాల్ నిర్మిస్తున్నామని, నూతన డ్రైనేజీ పైప్‌లైన్లు వేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, రాములు, రవీందర్, సురేందర్‌రాజు, నాయికోటి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



బడంగ్‌పేట్ మాతృశ్రీ ఎన్‌క్లేవ్‌లో భూగర్భ డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న కమిషనర్ సరస్వతి, ఎస్ఐ యాదగిరి



మీర్‌పేట్‌లో మురుగు కాల్వలు శుభ్రం చేయిస్తున్న కమిషనర్ జ్ఞానేశ్వర్

మురుగు కాల్వల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

● మీర్‌పేట్, బడంగ్‌పేట్ కమిషనర్లు జ్ఞానేశ్వర్, సరస్వతి

● కొనసాగుతున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్

సరూర్‌నగర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రానున్న వానా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మురుగు కాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని, వ్యర్థాలను తొలగించడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల కమిషనర్లు ఆర్.జ్ఞానేశ్వర్, పి.సరస్వతి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సోమవారం భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు, ఓపెన్ నాలాలు శుభ్రం చేసే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మీర్‌పేట్‌లోని 5వ, 40వ డివిజన్లలో పారిశుధ్య సిబ్బందితో కలిసి పర్యటించిన కమిషనర్ జ్ఞానేశ్వర్.. ఇక్కడి ఓంసాయినగర్, వెంకటసాయి ఎన్‌క్లేవ్ తదితర కాలనీల్లో మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. ఇక బడంగ్‌పేట్‌లోని మాతృశ్రీ ఎన్‌క్లేవ్‌లో కమిషనర్ సరస్వతి ఎస్ఐ యాదగిరితో కలిసి పర్యటించి భూగర్భ మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. అదేవిధంగా స్థానిక మహిళలకు తడిపొడి చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్షాకాలంలో వరద ముంపు తలెత్తకుండా ఉండేందుకుగాను మురుగు కాల్వలను శుభ్రం చేయిస్తున్నట్టు చెప్పారు. కాల్వల్లో పేరుకుపోయే చెత్తాచెదారం కారణంగా వరదనీరు, మురుగునీరు బయటకు ప్రవహించి వీధులను ముంచెత్తే ప్రమాదం ఉన్నందున వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కాల్వలను శుభ్రం చేయించడంపై దృష్టి పెట్టినట్టు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మీర్‌పేట్, బడంగ్‌పేట్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రమేశ్, వి.యాదగిరి, మేనేజర్లు చంద్రప్రకాశ్ రెడ్డి, బి.నాగేశ్వర్‌రావు, ఆర్‌ఐలు చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఈఈలు రాము, మౌనిక, వార్డు ఆఫీసర్లు, పలు విభాగాల సిబ్బంది, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.



లోక్‌అదాలత్ కోఆర్డినేషన్ సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సల్మాఫాతిమా

కేసుపై కక్షిదారులకు అవగాహన కల్పించి రాజీ కుదర్చాలి: జడ్జి సల్మా

హయత్‌నగర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని సోమవారం హయత్‌నగర్‌లోని 14వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టులో కో- ఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోర్టు జడ్జి సల్మాఫాతిమా మాట్లాడుతూ కేసుల గురించి కక్షిదారులకు అవగాహన కల్పించి రాజీకుదిర్చే ప్రయత్నం చేయాలని కోరారు. సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు రాజీ కుదిర్చే ప్రయత్నం చేయాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో ఏపీపీ లావణ్యకుమార్, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, సీఐలు నాగరాజుగౌడ్, అశోక్‌రెడ్డి, గట్టుమల్లు పాల్గొన్నారు.

అవసరం మేరకే ఎరువులను వాడండి: రజనీకాంత్



రైతు అవగాహన సదస్సులో శాస్త్రవేత్త రజనీకాంత్, రైతులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అవసరం మేరకే పంటలకు ఎరువులు వాడాలని ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ పి. రజనీకాంత్ రైతులకు సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని చిన్నరావిరాల గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాస్త్రవేత్త రజనీకాంత్ మాట్లాడుతూ అవసరం మేరకు పంటలకు ఎరువులు వాడి.. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. అదేవిధంగా యూరియాను తక్కువగా ఉపయోగించి పంట ఖర్చును కూడా తగ్గించుకోవాలన్నారు. పంట ఖర్చులకు సంబంధించిన రసీదులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని అకాల పంటనష్టం జరిగిన సమయంలో అవి ఉపయోగపడుతాయన్నారు. పంట మార్పిడి తప్పకుండా పాటించాలని సూచించారు. వ్యవసాయ పంట పొలాల వద్ద పెద్ద ఎత్తున మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాల కోసం రైతులు తమ పట్టాదారు పాసుబుక్‌తో పాటు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలను వ్యవసాయ అధికారులకు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త అరుణశ్రీ, వ్యవసాయ అధికారి పల్లవి, వ్యవసాయ విస్తరణ అధికారి రఘు, రైతులు శ్రీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, పల్లారెడ్డి పాల్గొన్నారు.

రోహింగ్యాలను గుర్తించండి.. మదర్సాలను తొలగించండి

● జిల్లా కలెక్టర్‌కు అందెల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీరాములుయాదవ్ తదితరులు

సరూర్‌నగర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలను గుర్తించి వారిని భారత్ నుంచి పంపించేయడానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. అదేవిధంగా మండల పరిధిలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న మదర్సాలను వెంటనే తొలగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములుయాదవ్ మాట్లాడుతూ రోహింగ్యాల వల్ల భవిష్యత్‌లో దేశానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నదని, వారంతా పాక్‌కు అనుకూలంగా వ్యవహరించే వ్యక్తులని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పార్టీ నాయకులు ఇటీవల నిర్వహించిన సర్వేలో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అనేక మంది ఎలాంటి ఆధారాలు లేకుండా ఇక్కడి జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు పొందినట్టు తేలిందని, అవన్నీ వెంటనే రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. మదర్సాలలో బాల్యం నుంచే ఉగ్రవాదంపై పాఠాలు బోధిస్తున్నారని, అలాంటి మదర్సాలతో దేశ భద్రతకు ముప్పు తప్పదని ఆయన అన్నారు. ఈ దృష్ట్యా రోహింగ్యాలను గుర్తించి దేశం నుంచి పంపేయాలని, అక్రమ మదర్సాలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, యెల్పుల భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్ యాదవ్, జక్కిడి మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవద్దు



డీటీ మణిపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రవి, సుధాకర్

సరూర్‌నగర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలంలోని సర్వే నంబర్.74 బాలాపూర్ వీకర్ సెక్షన్ కాలనీలో పాత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలున్న వారు నివాస గృహాలు నిర్మించుకుంటుంటే రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని, ఇది ఎంత వరకు సమంజసమని ఎమ్మార్పీఎస్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ పట్టాదారులపై రెవెన్యూ అధికారులు వేధింపులు ఆపాలని, నిర్మాణాలను అడ్డుకోవద్దని వారు కోరారు. ఈ మేరకు సోమవారం బాలాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు బొర్ర రవిమాదిగ, మస్కూరి సుధాకర్‌మాదిగ తదితరులు డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్.74లో గతంలో వ్యవసాయం చేసుకుంటున్న దళిత రైతుల నుంచి కేంద్ర రక్షణ రంగ సంస్థ ఏఆర్‌సీఐ కోసం భూములు సేకరించిందని, ఆ సమయంలో వారికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు జారీ చేసిందని పేర్కొన్నారు. అప్పట్లో ఆర్థిక పరిస్థితులు అనుకూలించక అనేక మంది ఇళ్ల నిర్మాణం చేపట్టలేదని, ప్రస్తుతం ఇళ్లు నిర్మించుకుంటుంటే రెవెన్యూ అధికారులు వచ్చి కూల్చేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలు నిర్మించుకుంటున్న ఇళ్ల జోలికి రావొద్దని వారు విజ్ఞప్తి చేశారు. కాగా సదరు పట్టాలపై విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని డీటీ తెలిపారు.

సరూర్‌నగర్ చెరువును శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలి



సరూర్‌నగర్ చెరువు కట్టపై ఎంటమాలజీ సిబ్బందికి సూచనలిస్తున్న జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్ : సరూర్‌నగర్ చెరువును శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి కోరారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం సరూర్‌నగర్, ఎల్బీనగర్ సర్కిళ్ల ఎంటమాలజి సిబ్బంది చెరువులోని గుర్రపు డెక్క, వ్యర్థాల తొలగింపు పనులను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సరూర్‌నగర్‌చెరువు పరిసరాలలో నివసిస్తున్న వారు ఎవరికివారు చెరువు చుట్టూ చెత్తను వేయకుండా బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇతరులు కూడా చెత్త వేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఎస్‌ఈ మాధవరెడ్డి, సరూర్‌నగర్ ఏఈ రాంబాబు, ఎల్బీనగర్ ఏఈ మణి, అర్జున్, షాన్, యాదయ్య, శంకర్ పాల్గొన్నారు.

జిల్లా ఉషా అసోసియేషన్ అధ్యక్షుడిగా విపిన్ గులాటి

ఎల్బీనగర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఉషా అసోసియేషన్ అధ్యక్షుడిగా విపిన్ గులాటి ఎన్నికయ్యారు. సరూర్‌నగర్‌లో జరిగిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మధుసూదన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జాల మనోహర్‌కుమార్, కోశాధికారిగా కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా హసన్, వెంకటమురళి, రవికుమార్, ఓసామ, కార్యవర్గసభ్యులుగా సాయికుమార్, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి మహమ్మద్ మాషి ఇమ్రాన్, పర్యవేక్షకులు ఎం. రవికుమార్, బి. బాలకృష్ణ తెలిపారు.

మాజీ ఎంపీటీసీ రంజిత్‌రెడ్డి మృతి

చాదర్‌ఘాట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నాయకుడు, ఉమ్మడి సరూర్‌నగర్ మండలంలోని మీర్‌పేట మాజీ ఎంపీటీసీ తీగల రంజిత్‌రెడ్డి సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందాడు. కొంతకాలంగా లివర్ సమస్యతో బాధపడుతున్న రంజిత్‌రెడ్డికి ఆరేడు నెలల క్రితం లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కూడా చేశారు. అనంతరం కొంత మెరుగైన రంజిత్‌రెడ్డి ఆరోగ్యం కొన్ని రోజులుగా ఒక్కమారుగా అస్వస్థతకు గురయ్యారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. రంజిత్‌రెడ్డికి భార్య, కూతురు ఉన్నారు. కూతురు అమెరికాలో ఉండడంతో ఆమె వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబీకులు నిర్ణయించారు. ఉమ్మడి సరూర్‌నగర్ మండలంలో మీర్‌పేట ఎంపీటీసీగా కాంగ్రెస్ తరఫున 2006 నుంచి 20011 వరకు పనిచేసిన రంజిత్‌రెడ్డి మాజీ హోంమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డికి సన్నిహితుల్లో ఒకరుగా కొనసాగారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరి తన తమ్ముడైన తీగల అజిత్‌రెడ్డి భార్య తీగల సునరితారెడ్డికి మూసారాంబాగ్ కార్పొరేటర్‌గా బీఆర్‌ఎస్ నుంచి టికెట్ సాధించి గెలిపించి తన రాజకీయ పలుకుబడిని చాటుకున్నాడు. అనంతరం లివర్‌కు సంబంధించిన సమస్యతో కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రంజిత్‌రెడ్డి రాజకీయాలకు దూరమయ్యాడు. రంజిత్‌రెడ్డి మృతితో ఆయన సొంత గ్రామమైన మీర్‌పేటలో, నివాసముంటున్న మూసారాంబాగ్‌లోని సలీంనగర్‌లో విషాదఛాయలు అలముకున్నాయి.

ఎండీఎంఏ తరలిస్తున్న పాత నేరస్థుడి అరెస్టు

● 17 గ్రాముల నిషేధిత మాదకద్రవ్యం, సెల్‌ఫోన్ స్వాధీనం

కొత్తపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నిషేధిత మాదకద్రవ్యం ఎండీఎంఏ తరలిస్తున్న పాత నేరస్థుడిని ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని లా అండ్ ఆర్డర్ పీఎస్‌లో అప్పగించారు. ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ వెంకట్, ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్ ఖాసీముద్దీన్ హయత్‌నగర్ ఆనంద్‌నగర్ కాలనీలో ఉంటున్నాడు. తాను మాదక ద్రవ్యాలను సేవించడంతో పాటు బెంగళూరులో సౌరవ్‌సంతోష్ అనే వ్యక్తి నుండి డ్రగ్స్ కొనుగోలు చేసి నగరానికి తరలించి, ఇతరులకు విక్రయిస్తుంటాడు. సోమవారం విశ్వసనీయ సమాచారం అందడంతో ఎల్బీనగర్ ఎస్‌ఓటీ, లా అండ్ ఆర్డర్ పోలీసులు సరూర్‌నగర్ స్టేడియం సమీపంలో గల పెట్రోల్ బంక్ వద్ద అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసులు అతడి వద్ద 17 గ్రాముల నిషేధిత ఎండీఎంఏ మాదకద్రవ్యం, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు. అతడు గతంలో గోపాలపురం పీఎస్ పరిధిలో ఒక కేజీ గంజాయితో పట్టుబడి కటకటాలు లెక్కించినట్లు సమాచారం.

దివ్యాంగుడి హత్య కేసులో నిందితుడి అరెస్టు

చాదర్‌ఘాట్ : దివ్యాంగుడి హత్యకు కారకుడైన నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ కేబీ మురారీ తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానాకు చెందిన మహ్మద్ ఇర్షాద్‌అలీ ఎలియాస్ ఇర్షాద్(25) వంట మనిషిగా పనిచేస్తున్నాడు. రోజువారి కూలీగా పనిచేసి జీవనం సాగిస్తున్న న్యూమలక్‌పేట జడ్జెస్ కాలనీనివాసి నిజాముల్ హఖ్ ఎలియాస్ ఖుద్దూస్(22) ఇర్షాద్ స్నేహితులు, ఖుద్దూస్ ఇంట్లోనే మహిళ షయనాజ్‌తోపాటు ఆమె కూతురు షయనాబాను ఉంటుంది. షయనాబానుతో పరిచయం పెంచుకోవడానికి ఇర్షాద్ తరచూ ఖుద్దూస్ ఇంటికి వచ్చేవాడు. ఈ విషయం గుర్తించిన ఖుద్దూస్ ఇర్షాద్‌తో పలుమార్లు వారించాడు. అయినా వినకుండా బక్రీద్ వేడుకల్లో తన సోదరులతో కలిసి సినిమాకు యువతి షయనాబానును తీసుకెళ్లేందుకు వచ్చాడు. ఇంతలో ఖుద్దూస్ గమనించి నిరాకరించాడు. దీంతో ఇర్షాద్, ఖుద్దూస్ మధ్య తలెత్తిన వివాదంలో ముందుగా ఖుద్దూస్ కత్తితో ఇర్షాద్‌ను బెదిరించేందుకు ప్రయత్నిస్తుండగా కత్తి ఇర్షాద్ మెడకు గుచ్చుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన ఇర్షాద్ ఆ కత్తిని ఖుద్దూస్ చేతి నుంచి లాక్కొన్నాడు. ఖుద్దూస్ ఛాతిపై కుడివైపు పొడవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సోమవారం డబీర్‌పుర రైల్వేస్టేషన్ సమీపంలో సంచరిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు చాదర్‌ఘాట్ పోలీసులు నిఘావేసి పట్టుకున్నారు. అనంతరం నిందితుడు ఇర్షాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. హయత్‌నగర్ డివిజన్ కమలానగర్, ఆంధ్రకేసరినగర్ కాలనీలపై సంబంధిత అధికారులు రిజిస్ట్రేషన్‌లపై స్టేటస్ కో విధించిన నేపథ్యంలో సోమవారం కమలానగర్‌లో కాలనీవాసులు ఏర్పాటు చేసిన సమావేశానికి మధుయాష్కీ గౌడ్ హాజరై మాట్లాడారు. నలభై ఏళ్లక్రితం రిజిస్ట్రేషన్‌తో ఏర్పడిన కాలనీలు నేడు ఇనాం భూములంటూ సదరు కాలనీలకు స్టేటస్ కో విధించడం సహించరానిదన్నారు. కొంతమంది స్వార్థపరులు తెరవెనుకాల ఉంటూ కాలనీవాసులను భయాందోళనకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఆర్డీవోకు మధుయాష్కీగౌడ్ ఫోన్‌చేసి సదరు కాలనీలకు ఇచ్చిన స్టేటస్ కో తక్షణమే తొలగించాలని సూచించారు. దీంతో ఆర్డీవో త్వరలోనే సదరు కాలనీల స్టేటస్ కోను తొలగిస్తానని హామీ ఇచ్చారు. ఒక వేళ సంబంధిత అధికారులు స్టేటస్‌కోను తొలగించిన యెడల ఈ విషయాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కాలనీవాసులు నిశ్చింతగా తమ జీవన విధానాన్ని కొనసాగించాలని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని రవీందర్, కాలనీవాసులు టీవీరావు, సుబ్బారావు, దివాకర్ లింగంచౌదరి, కాలనీవాసులు పాల్గొన్నారు.

మధుయాష్కీగౌడ్‌ను కలిసిన ఆలయ పాలకమండలి చైర్మన్

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయ పాలకమండలి నూతన చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, ధర్మకర్తలు సోమవారం కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఆలయ పాలక మండలి చైర్మన్, ధర్మకర్తలుగా నియామకం కోసం సంపూర్ణ సహకారం అందించినందుకు గాను వారు మధుయాష్కీగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాతానాయక్, ధర్మకర్తలు ఎనుముల రవీందర్‌రెడ్డి, పూల నాగరాజు, కె.కవిత, తోకటి కిరణ్‌కుమార్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై మధుయాష్కీగౌడ్‌కు ఫిర్యాదులు



కాలనీవాసుల సమావేశంలో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

హయత్‌నగర్ : టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను నియోజకవర్గంలోని పలు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు టీ.నగర్‌లోని ఆయన ఇంటి వద్ద కలిసి వినతిపత్రాలు సమర్పించారు. డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు. వీధి దీపాల సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘాల నుంచి ఫిర్యాదులు అందుకున్న మధుయాష్కీగౌడ్ ఆయాశాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వివరించారు. అనంతరం కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ధర్మకర్తలు మధుయాష్కీగౌడ్‌ను కలిశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ తదితరులు పాల్గొన్నారు.